# పరిచయ పత్రం

'మధుర'



**ఆ**రోజు సాయంకాలం రాజశేఖరానికి రవీంద్రభారతిలో గొప్ప సన్మానం జరగబోతున్నది. రేడియోలో శతాధిక నాటికలు నిర్వహించి, వివిధ పాత్రలకు జీవంపోసి, రక్తికట్టించి, వైవిధ్యం గల కథానికలూ, నవలలూ, నాటికలూ రాసి కీర్తి గడించిన కళా తపస్వికి తెలుగుదేశం నీరాజనం పడుతున్నది! సాహిత్యవేత్తలకే అది గొప్ప పర్వదినమల్లే ఉన్నది.

తను ఇంత గొప్ప రచయిత కావటానికీ, పేరు ప్రతిష్ఠలు రావటానికీ కారణమేమిటో, ఆవేళ రాజశేఖరం, నిండుసభలో చెప్పదలచుకున్నాడు. తనకు జరగబోతున్న సన్మానం గురించి తలుచుకుంటే రాజశేఖరంకళ్ళు ఆర్ద్రమైనై. అప్రయత్నంగానే జేబులో భద్రంగా ఉన్న కాగితం పైకి తీసి మరొక్కసారి చదువుకున్నాడు.

"శ్రీయుతులు రాజశేఖరంగార్కి, నమస్కారములు.


నే నెవరో మీకు తెలియదు. తెలియవలసిన అవసరం కూడా లేదు. కాని నాకు మాత్రం రేడియోలో మీ కంఠం విననిరోజు కాలం స్తంభించినట్లుగా ఉంటుంది మీ కంఠస్వరం చాలా చాలా మధురంగా, మరిమరీ వినాలనిపించేటట్లు ఉందని నేను చెప్పబోవటం

లేదు. ఎందుకంటే అలా చెప్పటం హామి గుండ్రంగా ఉంది, నక్షత్రాలు ప్రకాశిస్తున్నాయి. మల్లెలు గుబాళిస్తున్నాయి, సంపంగివాసన మత్తెక్కిస్తోంది, తీయని వీణానాదం హాయిగా పరలోకానికి మోసుకుపోతుంది- అని చెప్పటంలా ఉంటుంది. అవి వాని సహజగుణాలు. నిత్యసత్యాలు. వేరే చెప్పటం ఎందుకూ? ఈ ధోరణి మీకు నవ్వు తెప్పిస్తోందనుకుంటాను. మరేం చేయను? నేను రచయితను కాదు మీలా. హృదయాన్ని దొంగిలించే పదజాలాన్ని అందంగా కూర్చి పరితుల్ని మతిలేనివారుగా చేయటానికి.

"మొన్న ప్రసారమైన విషాదాంత నాటకం విన్నాను. మీ కంఠంలో దుఃఖం సుళ్లు తిరుగుతోంటే, నా కళ్లల్లో నీళ్ళు చిప్పిల్లాయి. మావారు ఒకటే నవ్వు. "డ్రామా విని ఏడుస్తావేం పిచ్చిదానా?" అని. ఆయనకు ఎలా చెప్పాలో నాకు అర్థంకాలేదు. నిజంగా మీరు అంతగా పాత్రలో లీనమైపోయి ఎలా నటిస్తారండీ? ఆయా భావాల్ని, ఆయా రసాల్ని రూపు కట్టించి కంటికెదురుగా నిలబెట్టేటంతటి నేర్పు మీకు ఏ దేవుని వరంవల్ల వచ్చిందో కాస్త చెప్పరూ నాకు?

"కాలేజీలో చదివేరోజుల్లో ఒకనాడు...మీ కేంద్రంలో ఏదో సభ జరిగిన సందర్భంగా మీ గ్రూప్ ఫొటో పేపర్లో పడింది. మా ఫ్రెండ్ విజయ "ఇదిగో నీ ఫేవరెట్ శేఖరం!" అంటూ తెచ్చి కళ్ళముందు పెట్టింది. గట్టిగా కళ్ళు మూసుకున్న నన్ను చూసి బిత్తరపోయింది. "అదేం?'' అంటే "కల కరిగిపోతుందని భయం! నా ఊహ చెదిరిపోతుందేమో నని బాధ" కళ్ళు మూసుకుని అనే నన్ను చూచి ఫక్కున నవ్వింది విజయ. "ఇదేం గుడ్డి ఆరాధనే బాబూ!'' అంటూంటే ఏమని చెప్పను దానికి? మనసులోని భావాన్ని మాటల్లోనికి మారిస్తే విలువ తగ్గిపోతుందని నా అభిప్రాయం. సరే తర్వాత కుతూహలం పట్టలేక మీ ఫొటో చూశాననుకోండి. అయినా, మీ గొంతు విన్నప్పటి సంతోషం కలుగలేదంటే ఏమీ అనుకోరు కదూ!

నిజానికి కళ అంటే ఏమిటో నాకేం తెలీదు. అయినా కళాకారుడు అనగానే మీరే గుర్తుకువస్తారు. సుఖాంతమైన నాటకాల్లో మధురమైన మురళీ నాదంలా, నీలాకాశంలో అనాయాసంగా ఎగిరిపోయే తెల్లని మబ్బుతునకలా, విషాదాన్ని ప్రకటించేటప్పుడు సుడిగుండాలను తనలో దాచుకుని గంభీరంగా ప్రవహించే గోదావరి నదిలా అనేక రూపాలను సంతరించుకుంటుంది మీ కంఠస్వరం. అనేక భావాలు ఇంద్రధనుస్సులా విరిసి హృదయానికి హత్తుకుపోతాయి మీ గొంతు




వింటుంటే. నిరతాన్న ప్రదాయిని అయిన జీవనదిలా సంతోషాన్ని పంచి పెడుతుంది మీ స్వరం! ఎలా వర్ణించను? ఏమని వర్ణించను? నాకు మాటలు దొరకటం లేదు

"మిమ్మల్ని ముఖాముఖి కలుసుకోవాలని కాని, మీతో మాట్లాడాలని కాని నాకు లేనేలేదు. నిజం! దేవుడంటే నాకు భక్తివుంది. రోజూ పూజ చేయకపోతే ఆ రోజు అన్నం తిననట్లుగానే ఉంటుంది. కనిపించని ఆ స్వామికి నేను వినిపించని భావాలు లేవు. అయినా, ఒకవేళ హఠాత్తుగా ఆ దేవుడు ప్రత్యక్షమైతే...అమ్మో! ఈ పేదగుండె భరించగలదా? అసాధ్యం! అందుకే మిమ్మల్ని కలుసుకోవాలని లేదు నాకు. చందమామను ఇక్కణ్ణుంచి చూసి సంతోషిస్తాను. కాని హఠాత్తుగా రష్యావాళ్ళు రాకెట్టు తెచ్చి "నిన్ను చంద్రమండలంపైకి పంపిస్తాం" అంటూ నా ఎత్తు ధనం పోసి బ్రతిమాలినా...ఊహు...నేను పోనేపోను. ప్రాణభయం కాదు. అందమైన భ్రాంతి చెరిగిపోతే తట్టుకోలేనని.

"పైగా నాకు మరో భయంకూడా. మీరు రచయితలు కదా! పరమనో ప్రవేశంలో సిద్ధహస్తులు. మొహం చూసి మనసులోని భావాలు చదివేస్తారేమో నని భయం! అందుకే...ఎదుట పడను.

"మీ రచనల్లో స్త్రీపాత్రల్ని ఎంతో నేర్పుగా మలిచారండీ! మెచ్చుకోకుండా ఉండలేను. అతిలోక సౌందర్యంతో, అంతులేని త్యాగంతో, చిరు

నవ్వు చిందిస్తూ, జనంకేసి జాలిగా చూస్తూ, అందరికంటే తాము ఉన్నతంగా, ఈ లోకపు పరిధుల్లో లేనట్లు ప్రవర్తించే నాయికలంటే నాకు ఒళ్లు మండిపోతుంది. మీ నవల చదివేముందు అలాంటి వాళ్ళను ఎదుర్కోవలసి వస్తుందేమోనని భయపడ్డాను కాని చదివాక మీమీద అభిమానం రెట్టింపయిందంటే ముఖస్తుతి అనుకోరు కదూ! చిన్న చిన్న విషయాల్లో దాగిన సత్యంవైపు చదువరుల దృష్టిని ఆకర్షించటం, సున్నితమైన మాటల్లో గాఢమైన భావాల్ని ప్రకటించటం మీ ప్రతిభకు తార్కాణం. అల్పమైన శబ్దాల్లో అనల్పమైన భావాన్ని స్ఫురింపచేయటం మీ నైపుణ్యం. మీ గీతాల్లో వినిపించేఆవేదన, ఆత్మార్పణ చేసుకోవాలనే ఆరాటం, శరీరాన్ని మరచిపోయే ఆవేశం, మనసు నిండి పొంగిపోయే ఉత్సాహం...అనుభవైకవేద్యం. ఇవన్నీ చదివాక నాకు మీ శ్రీమతిని చూడాలనిపిస్తోందండీ! నిజంగా ఆమె పూర్వజన్మలో బంగారు పుష్పాలతో పూజచేసుకుని ఉంటారు.

"ఇంతకీ ఇది ప్రశంశాపత్రం కాదు. ప్రేమలేఖ అంతకన్నా కాదు. కేవలం మీకు నా భావాలను తెలిపే పరిచయపత్రం మాత్రమే.

వందనములతో.

ఒక అభిమానురాలు"

లేఖ పూర్తిచేసిన శేఖరం ముఖంలో ఆశ్చర్యం, ఆనందం, కలగలిసిన విచిత్రభావం మళ్ళీ మరొకసారి తళుక్కుమని మెరిసింది. అతని హృదయాన్నేదో మృదులభావం ఆవరించిన ట్లయింది. పదిహేనేళ్ళ కిందట, ఆ వుత్తరం అందినప్పుడూ అదే భావం కలిగింది. ఆ వుత్తరం చదివినప్పుడల్లా అదే అనుభవం. ఈ పదిహేనేళ్లూ కాలచక్రంలో గిరుక్కున తిరిగిపోయినా, శేఖరం ఆ ఉత్తరంమటుకు మర్చిపోలేకపోయాడు మళ్ళీఅలాంటి లేఖఅందుకోలేదుకూడా.

*   *   *

రవీంద్రభారతి సాహితీ ప్రియులతో కలకలలాడుతోంది. పుష్పమాలాలంకృతుని జేసి వేదికపై కూర్చుండబెట్టారు రాజశేఖరాన్ని. పెద్దలంతా అతని కృషిని ప్రశంసించి, సంతోషంగా ఆశీర్వదించారు. అతని అడుగుజాడల ననుసరించాలని ప్రయత్నించే యువ రచయితలు శేఖరం గొప్పతనాన్ని ఉగ్గడిస్తూ ప్రసంగాలు చేశారు. సాహితీసంఘం వారు కాశ్మీరు శాలువా కప్పి, వెయ్యినూట పదహార్లు సమర్పించి తమ సంతోషాన్ని వెల్లడించారు సన్మానరూపంలో.

తనకు జరిగిన సన్మానానికి కృతజ్ఞత తెలుపటానికి లేచాడు రాజశేఖరం. వయసునుమించి పండిపోయిన జుత్తు వెండితీగెల్లా మెరుస్తోంది.



మొహంలో మంచిదనం ముద్ర వేసుకుంది. చూడగానే చెయ్యెత్తి నమస్కరింపజేసే తేజస్సు ముఖంలో. ఈ సన్మానం తనకు కాదనీ, తనలో నిద్రాణమైయున్న శక్తిని మేల్కొలిపిన ఘనత సుమారు పదిహేనేళ్ళ క్రితం ఒక అభిమానినుండి వచ్చిన లేఖనేననీ పలికాడు. అంతమంది సాహితీ ప్రియులతో నిండిన భవనంలో ఆశ్చర్యంగా నిశ్శబ్దం అలముకొంది. అందరూ ఆసక్తిగా వినసాగారు.

"నిజం చెప్పాలంటే ఏనాడైనా నాకిలాంటి సన్మానం జరుగగలదని కలలో కూడా అనుకోలేదు. కాని ఆ లేఖ నాలో ఆశలు చిగురింపజేసింది. నన్ను ఉత్సాహంతో అడుగు ముందుకు వేయించింది. నాకు వెన్నెముకగా నిలచి ధైర్యాన్ని పురిగొల్పింది. నూత్న పంథాలో రచనలు చేయించింది. శ్రద్ధాసక్తులతో పాత్రల్లో లీనమై జీవించేట్లు చేసింది. నాకు మార్గదర్శకమై నన్నింతవాణ్ణి చేసింది. ఆ అభిమాని వ్యక్తిగతంగా నాకు తెలియకపోయినా ఈ క్షణం మాతో ఉండి ఉంటారనే నా విశ్వాసం. వారికి నా మనఃపూర్వక కృతజ్ఞతాంజలి."

చేతులు జోడించాడు రాజశేఖరం. కరతాళధ్వనులు మిన్నుముట్టాయి. ఆ ధ్వని నిమ్మదించిన తర్వాత "మీ అందరికి అభిమానపాత్రుడనైనందుకు నన్ను నేనే అభినందించుకుంటున్నాను. నిజానికి ఇది నాకు సన్మాన సభ కానే కాదు. సాహితీప్రియులందరికీ సంతోష సభ! సరస్వతీదేవి కాలి అందియలు సందడిచేసే పవిత్రాలయం."

శ్రోతలు ఆనందంతో సముద్రంలా పొంగిపోయి హర్షాన్ని ప్రకటించారు. కార్యక్రమం పూర్తిఅయింది. జనం అంతా వెళ్ళిపోతున్నారు. చుట్టూ మూగి పలుకరించేవారికి యాంత్రికంగా సమాధానాలిస్తున్నాడు శేఖరం! అతని కళ్లు దేనినో వెదుకుతున్నట్లున్నాయి. ఏదో అసంతృప్తిగా ఉంది మనసులో. అందర్నీ తప్పించుకుని ఒక మూలగా నిలబడిపోయాడు. ఆలోచనలతో ఎవరో పలకరించారు అతన్ని.

"మీ శ్రీమతిగారు రాలేదా ?"

ఒక్కసారిగా శేఖరం కళ్లు మెరిశాయి.

ఇంత సేపటి అన్వేషణ ఫలించినట్లుగా.

కణతల దగ్గర నెరుస్తున్న జుట్టు, నుదుటిపై గుండ్రని పెద్దబొట్టు, కష్టసుఖాల్ని, వెలుగు నీడల్ని కలగలిపినట్లుగా చామనచాయవర్ణం, పొడవుకు తగ్గలావుతో హుందాతనం ఉట్టిపడుతూ, ఆకుపచ్చని జాకెట్టు, తెల్ల చీర ధరించి, మెడలో ముత్యాలదండని మరిపించే తెల్లని నవ్వుతో, కళ్ళజోడులోంచి ప్రశాంతంగా చూసేకళ్ళతో, ఎదురుగా నిలబడిందొక స్త్రీమూర్తి.

"మీరు...మీరేనా ?"

ఆమె నవ్వింది. "అవును నేనే.".

అతను అవాక్కయి నిలబడ్డాడు.

"నా ప్రశ్నకు సమాధానం రాలేదు." మృదువుగా అడిగింది.

తేరుకుని నవ్వాలని ప్రయత్నించాడు.

"ఆమె నామీద అలిగి స్వర్గానికి వెళ్ళిపోయి పదేళ్ళయింది."

అతని ముఖాన్ని నీలినీడలు ముసిరాయి.

"కాని నాకు తోడుగా ఇది మిగిలింది." జేబు తడుముకున్నారు

ఆమె మొహం వాడిపోయింది.

"అదృష్టవంతు లెప్పుడూ అల్పాయుష్కులే " అంతలో తేరుకుని, "ఆ జేబులో ఉన్న తోడేమిటో తెలుసుకోవచ్చునా ?" నవ్వింది ఆమె. అతని భార్యఫోటోఏమో అనుకుంది కాని అతని సమాధానం, "పరిచయపత్రం."

మూగగా ఒకరి కళ్ళల్లోకి ఒకరు క్షణంపాటు చూసుకున్నారు

"అతి చిన్న విషయాలు ఒక్కోసారి జీవితంలో ఎంతటి ప్రముఖపాత్ర వహిస్తాయో ?" కలవరిస్తోన్నట్లు, తనలో తాను అనుకుంటున్నట్లుగా అన్నదామె.

మౌనమే అతని సమాధానం.

నిశ్శబ్దంగా చేతులు జోడించి వెనుదిరిగి వెళ్ళిపోయిందామె

నిజమైన సన్మానం అప్పుడే జరిగిందా అన్నట్లు అతని మనసునిండా తృప్తి పరచుకొంది.

ఆకాశంలో చుక్కలు మరింత వింతగా ప్రకాశించాయి.